


రేపు కలమల్లకు వెంకయ్యనాయుడు రాక

ఎర్రగుంట్ల, ఆగస్టు 27: భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గురువారం ఎర్రగుంట్ల మండలం కలమల్లకు రానున్నారు. తెలుగుభాషా దినోత్సవం కలమల్లలో ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయడు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. 29వ తేదీ ఉదయం హైదరాబాదు నుంచి విమానంలో బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రైలులో బయలుదేరి 11.35గంటలకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చేరుకుంటారు. రోడ్డు మార్గాన కలమల్ల సభా ప్రాంగణానికి చేరుకుంటారు.

అందరికీ తిరుపతే కావాలంట

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న ఉద్యోగుల బదిలీల్లో ఎక్కువ మంది తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. కానీ, తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువయ్యారు. ఈ సమస్యపై బుధవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించనున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



సిఫార్సు లేఖలతో ఉద్యోగుల ప్రయత్నాలు ముమ్మరం

చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువు

బదిలీలపై నేడు మూడు జిల్లాల కలెక్టర్ల సమీక్ష

చిత్తూరు జిల్లాలో 43 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో తిరుపతికి 31 మంది, అన్నమయ్యకు 12 మంది వెళ్తామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ విషయానికొస్తే.. డిప్యూటీ తహసీల్దార్లు చిత్తూరు నుంచి తిరుపతికి 8 మంది, అన్నమయ్యకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతికి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోలు చిత్తూరు నుంచి తిరుపతికి 10 మంది, అన్నమయ్యకు 13 మంది వెళ్తామంటున్నారు. సీనియర్ అసిస్టెంట్లు చిత్తూరు నుంచి తిరుపతికి ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతి ఒకరు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రస్తుత చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో పనిచేసే వారిలో ఎక్కువ మంది ఇప్పటికీ తిరుపతిలోనే నివాసం ఉంటున్నారు. రోజువారీగా విధులకు వచ్చి వెళుతున్నారు. వీరంతా తిరుపతి జిల్లాకు దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా బదిలీ అవసరమున్న ఉద్యోగులు తమకు పరిచయమున్న కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు సంపాదిస్తున్నారు. అటెండర్ల నుంచి అధికారుల వరకు.. తాము చేసుకున్న దరఖాస్తుకు ఆయా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల్ని కచ్చితంగా జత చేస్తున్నారు. బదిలీకి అవకాశం లేని వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అధికారులకు అర్థం కావడం లేదు.

ఎవరైనా 'అన్నమయ్య'కు వస్తారా?

అన్నమయ్య జిల్లా మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేసే ఓ ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ భర్త చిత్తూరు పక్కన తమిళనాడు రాష్ట్రంలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చిత్తూరు చుట్టుపక్కల బదిలీ కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆమెను చిత్తూరుకు పంపేందుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ సిద్ధంగా లేరు. చిత్తూరు నుంచి అన్నమయ్య జిల్లాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అదే హోదా కలిగిన ఉద్యోగి కావాలి. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా 'అలా చిత్తూరు నుంచి అన్నమయ్యకు వెళ్లేవారు ఉంటే చూసుకుని రండి' అంటూ వారికి సలహా ఇచ్చారు. దీంతో వారు అన్నమయ్య జిల్లాకు మ్యూచ్యువల్‌గా వచ్చే వారున్నారా అంటూ వెతికే పనిలో పడ్డారు.

ఇలాంటి ప్రత్యేక కేసుల్ని పరిగణలోకి తీసుకోవాలి

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ఓ మహిళా వీఆర్వోకు తిరుపతికి బదిలీ అవ్వాల్సిన అవసరం ఉంది. ఆమె ఒంటరి మహిళ కావడంతో పాటు తన నాలుగేళ్ల కుమార్తె క్యాన్సర్‌తో బాధ పడుతోంది. తిరుపతిలోని తల్లిదండ్రుల వద్ద కుమార్తెను ఉంచి నిత్యం చిత్తూరుకు వచ్చి వెళ్లడం కష్టంగా మారింది. అదే తిరుపతిలో అయితే కుమార్తె బాగోగులు దగ్గరుండి చూసుకుంటూ ఉద్యోగం చేసుకోవచ్చు. ఆమె తిరుపతికి వెళ్లాలంటే అక్కడి నుంచి చిత్తూరుకు మరో వీఆర్వో రావాలనే నిబంధన ఉంది. తాజా బదిలీ తీరు చూసుకుంటే తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. అందరూ తిరుపతే కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి మానవతా దృక్పథంతో అధికారులు న్యాయం చేయాల్సి ఉంది.

మ్యూచ్యువల్ ఉంటేనే అనుమతి

తన జిల్లా నుంచి ఒక ఉద్యోగిని కలెక్టర్ రిలీవ్ చేయాలంటే కచ్చితంగా అదే హోదా కలిగిన వ్యక్తి బయటి నుంచి రావాల్సి ఉంది. అందరూ చిత్తూరు నుంచి వెళ్లిపోతామనే దరఖాస్తులు చేసుకుంటున్నారే తప్ప, జిల్లాకు వస్తామనే దరఖాస్తులు లేవు. అధికారులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో మ్యూచ్యువల్ ఉంటేనే బదిలీలను పరిగణనలోకి తీసుకోనున్నారు. అంటే చిత్తూరు నుంచి తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల స్థానంలో అక్కడి నుంచి అదే హోదా కలిగిన ఉద్యోగి చిత్తూరుకు వస్తేనే బదిలీ చేస్తారు. లేకుంటే పరిగణనలోకి తీసుకునే అవకాశాలు తక్కువ. తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి రావాలన్నా ఇదే సూత్రంగా అమలు చేస్తున్నారు.

ములకలచెరువులో

టెన్షన్.. టెన్షన్...

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీడీపీ శ్రేణుల నిరసన
- కవ్వింపు చర్యలకు పాల్పడ్డ వైసీపీ
- ఎదురుతిరిగిన టీడీపీ.. వాయిదా పడ్డ మండల మీట్

ములకలచెరువు, ఆగస్టు 27: ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయం ఎదుట టెన్షన్ వాతావరణం నెలకొంది. మంగళవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఉదయం 6 గంటలకే మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఉదయం 9.30 గంటలకు రావడంతో టీడీపీ శ్రేణులు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రజల ఓట్లతో కాకుండా దొడ్డిదారిన గెలిచిన వైసీపీ ప్రజాప్రతినిధులకు సమావేశానికి హాజరయ్యే అర్హత లేదన్నారు. పదవులకు రాజీనామా చేసి ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన తరువాత సమావేశానికి రావాలన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ములకలచెరువులో భారీ బహిరంగ సభ జరిగిన మరుసటి రోజున నారా లోకేశ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి స్థానిక ప్రజా ప్రతినిధులు అవమానించారని, మంత్రి నారా లోకేశ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. టీడీపీ నిరసన తెలుపుతుండగానే వైసీపీ ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చారు. కార్యాలయం ముందు టీడీపీ శ్రేణులు ఉండడంతో పక్కనున్న తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఇప్పుడు కూడా మాపైనే దౌర్జన్యం చేస్తారా అంటూ టీడీపీ శ్రేణులు ఎదురుతిరిగారు. అప్పటికే అక్కడికి చేరుకున్న సీఐ రాజారమేష్, ములకలచెరువు, తంబళ్లపల్లె ఎస్ఐలు గాయత్రి, లోకేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ఇరువర్గాలను వెనక్కి పంపారు.

దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో ఎంపీడీవో పోలప్ప, మండల స్థాయి అధికారులు సమావేశపు మందిరంలోకి వెళ్లి సభ్యులు రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు నోటీసు బోర్డులో అంటించడంతో టీడీపీ శ్రేణులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నరసింహులు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాంజులు, పాల రాము, భాస్కర్‌నాయుడు, రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, వెంకటసిద్ధయ్య, శంకర, అమానుల్లా, శ్రీనివాసులు, సాంబశివ, షఫీ, చిన్నప్ప, మహిళా నాయకురాలు గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

రెండో రోజు సీఐడీ విచారణ

సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో నివేదికలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 27: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో సీఐడీ అధికారులు రెండోరోజు మంగళవారం కూడా విచారణ కొనసాగించారు. సోమవారం రాత్రి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో సీఐడీ అధికారులు సబ్‌కలెక్టరేట్‌లో విచారణ చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజతో పాటు ఆర్డీవో హరిప్రసాద్‌ను విడివిడిగా అధికారులు విచారించినట్లు తెలిసింది. దీంతో పాటు ఫైర్ అధికారులను కూడా విచారించారు. రాత్రి 12.30 గంటల వరకు వీడియో కవరేజి మధ్య అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సీఐడీ ఉన్నతాధికారులు అక్కడే తిష్ట వేశారు. మంగళవారం ఉదయం యధావిధిగా సబ్ కలెక్టరేట్ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐడీ ఎస్ఐలు, కానిస్టేబుళ్ల రాత్రి సేకరించిన వివరాలను కంప్యూటర్‌లో నివేదికల రూపంలోకి మార్చారు. దీంతో పాటు సబ్ కలెక్టరేట్ ఉద్యోగులను కూడా విచారించారు.

అక్రమార్కుల గుండెల్లో అలజడి

మదనపల్లె ఫైళ్ల దహనం కేసు విచారణను సీఐడీ అధికారులు వేగవంతం చేస్తుండటంతో ఫ్రీహోల్డ్ భూముల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డ రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, వైసీపీ నాయకుల గుండెల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే 8 మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు కాగా, వారిలో ఒక్కరిని కూడా సీఐడీ అధికారులు అరెస్టు చేయలేదు. దీంతో ఏడుగురు మదనపల్లెలో కాకుండా బయట ప్రాంతాలకు వెళ్లిపోయారు. నెల రోజులు అజ్ఞాతవాసంలో ఉన్న వీరందరూ ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. కాగా ఇప్పటికే మదనపల్లె మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్‌వోలను సీఐడీ అధికారులు విచారించినట్లు తెలిసింది. ఇకపోతే ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌లను, డీటీలను, ఆర్‌ఐలను విచారిస్తారా అనేది తెలియాల్సి ఉంది.

నరకం అనుభవిస్తున్నా..

- భర్త చనిపోయినా ఇంటికి పంపలేదు
- నారా లోకేశ్ అన్నా.. కాపాడండి..
- కువైత్ నుంచి వీడియో కాల్‌లో మహిళ ఆవేదన



నిమ్మనపల్లి, ఆగస్టు 27: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఏడాది క్రితం కువైత్‌కు వచ్చానని, అయితే ఇక్కడికి వచ్చినప్పటి నుంచి తన ఇంటి యజమానులు తనకు నరకం చూపిస్తున్నారని అయినా వాటిని భరిస్తూ వచ్చానని... అయితే నాలుగు రోజుల క్రితం తన భర్త చనిపోయాడని తెలిసిందని, తాను ఇండియాకు వెళతానని చెప్పినా తనను పంపకుండా ఇంకా ఎక్కువగా వేధిస్తున్నారని నారా లోకేశ్ అన్నా... నన్ను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని ఓ మహిళ పంపిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ సింగంవారిపల్లికి చెందిన రెడ్డిబాషా భార్య మయిమూన్‌కు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కూతురి పెళ్లి కోసం అప్పులు చేయడంతో వాటిని తీర్చేందుకు ఏడాది క్రితం కువైత్‌లోని సబాసాలేలో ఇంటిలో పనిచేసేందుకు వెళ్లింది. వెళ్లినప్పటి నుంచి ఇంటి యజమానులు తనకు నరకం చూపిస్తున్నా వాటిని భరించి అప్పులు తీర్చాలన్న ఉద్దేశ్యంతో వాటిని భరిస్తూ ఇక్కడే ఉన్నానని తెలిపింది. కాగా నాలుగు రోజుల క్రితం తన భర్త రెడ్డిబాషా అనారోగ్యంతో మరణించినట్లు కుమారుడు సయ్యద్‌బాషా తెలిపాడన్నారు. అప్పటి నుంచి తన యజమానురాలిని నేను ఇంటికి వెళతానని తన భర్త చనిపోయాడని చెప్పినా వినకుండా నీవు ఇంటికి పోవాలంటే వెయ్యి దీనార్లు కట్టి వెళ్లమని చెబుతోందని, తన భర్త చనిపోయిన ఫొటోలను చూపించినా వారు నమ్మలేదని రోదించింది. అంతేకాకుండా తనకు సక్రమంగా అన్నం కూడా పెట్టలేదని నాకు ఎవ్వరూ తెలిసిన వాళ్లు లేరని తనను నారా లోకేశ్ అన్న కాపాడి ఇండియాకు రప్పించాలని వేడుకుంది. దీనిపై మయిమూన్ కుమారుడు సయ్యద్‌బాషా మాట్లాడుతూ తన తండ్రి చనిపోయి నాలుగు రోజులైందని, ఈ విషయాన్ని కువైత్‌లో ఉన్న తన తల్లి మయిమూన్‌కు తెలిపినట్లు చెప్పాడు. తన తల్లిని నరకం నుంచి కాపాడి ఇండియాకు రప్పించాలని ప్రభుత్వాన్ని కోరాడు.

హార్సిలీహిల్స్ అభివృద్ధికి సీఎం చొరవ

- రూ.200 కోట్లతో ఒబెరాయ్ హోటల్ నిర్మాణం
- ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి





హార్సిలీహిల్స్ ప్రత్యేకతను ఒబెరాయ్ ప్రతినిధులకు వివరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్.. ఒబెరాయ్ హోటల్‌కు కేటాయించిన స్థలాన్ని చూపుతున్న జేసీ, సబ్ కలెక్టర్

బి.కొత్తకోట, ఆగస్టు 27: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పర్యాటకరంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఓ ప్రధాన ఘట్టానికి బీజం పడింది. హోటల్ రంగంలో ఖ్యాతి గడించిన ఒబెరాయ్ సంస్థ రూ.200 కోట్లతో నిర్మించనున్న సెవెన్‌స్టార్ హోటల్ నిర్మాణానికి తొలి అంకం పూర్తయింది. మూడేళ్ల క్రితమే ఒబెరాయ్ సంస్థకు స్థలం కేటాయించినప్పటికీ అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కదలిక మొదలైంది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇటీవల హిల్స్‌కు వచ్చి ఆ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ ముంబాయి నుంచి సంస్థ ప్రతినిధులను రప్పించేందుకు చొరవ చూపించారు. దీంతో మంగళవారం ఒబెరాయ్ గ్రూప్ కార్పొరేట్, లీగల్ అఫైర్స్ ప్రెసిడెంట్ ఆర్.శంకర్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ నవీన్‌గోస్వామి, ఇంజనీర్ మయాంక్‌తనేజలతో కూడిన బృందం హార్సిలీహిల్స్ చేరుకుని తమ సంస్థకు కేటాయించిన 20.90 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.

హిల్స్ ప్రత్యేకతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

కొండపై హోటల్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి వచ్చిన ఒబెరాయ్‌గ్రూప్ బృందానికి కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా హిల్స్ ప్రాధాన్యతను, ప్రత్యేకతలను వివరించారు. హిల్స్ సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో గల సుందర ప్రదేశమని, తిరుపతి, బెంగళూరు, కడప విమానాశ్రయాలకు సమాన దూరంలో ఉన్న సుందర, ఆహ్లాదకర ప్రదేశమని, చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, ఇప్పటికే కొండపై పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రదేశాల గురించి వివరించారు.

హిల్స్ అందాలకు ఫిదా..

ఒబెరాయ్ బృందం హార్సిలీహిల్స్ అందాలకు ఫిదా అయ్యారు. తమకు కేటాయించిన 20.90 ఎకరాల స్థలంతో పాటు గాలిబండ పైకి ఎక్కి చుట్టూ ఉన్న అటవీ అందాలు, లోయ ప్రాంతం, చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం చూసి ముగ్ధులయ్యారు. కొండపై హెలిప్యాడ్ సర్వీసుతో పాటు ప్రాజెక్ట్ నిర్మాణం విషయమై బోర్డు మీటింగ్‌లో చర్చించి రెండు నెలల్లో పనులు ప్రారంభించేలా చూస్తామని వారు కలెక్టర్‌కు తెలిపారు.

జిల్లాలో సర్క్యూట్ టూరిజం ఏర్పాటుపై దృష్టి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు హార్సిలీహిల్స్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. స్థల పరిశీలన అనంతరం గవర్నర్ బంగ్లాలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇచ్చి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పర్యాటకరంగం అభివృద్ధి చెందడానికి, అనుబంధరంగాల ఆదాయవృద్ధి, ఉపాధి దొరకడానికి అవకాశం ఉందని తెలిపారు. గుర్రంకొండ కోట, వెలిగల్లు రిజర్వాయర్ లాంటి వాటితో బెంగళూరు, తిరుపతి, కడపలను కలుపుతూ సర్క్యూట్ టూరిజం ఏర్పాటుపై దృష్టి పెడతామన్నారు. ఇక్కడ సెవెన్‌స్టార్ హోటల్ నిర్మాణం జరిగితే వీవీఐపీలతో హిల్స్ జాతీయస్థాయికి ఎదుగుతుందన్నారు. హిల్స్‌లో ఇటీవల చేపట్టిన అక్రమ నిర్మాణాలపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై రీవెరిఫికేషన్ కొనసాగుతోందని 1.30 లక్షల ఎకరాలలో లక్ష ఎకరాలు పూర్తి చేశామన్నారు. ఫ్రీహోల్డ్ భూములు 4400 ఎకరాలు రిజిస్టర్ జరిగితే అందులో 1200 ఎకరాలు పట్టాదారు కాకుండా ఇతరులు రిజిస్టర్ చేశారని వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, టూరిజం జిల్లా ఆఫీసర్ నాగభూషణం, హిల్స్ మేనేజర్ సాల్విన్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌రావు, సర్వేయర్ శ్రీవాణి, వీఆర్వో నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో డిపాజిట్లు చెల్లించేదెప్పుడో..!

● ఆరేళ్లు దాటినా.. అతీ గతి లేని వైనం ● ఇల్లు లేదు... డబ్బులు లేవు
● లబోదిబోమంటున్న లబ్ధిదారులు ● ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..

బద్వేలుటౌన్, ఆగస్టు 27: టీడీపీ ప్రభుత్వం 2014-2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు సామాన్య, పేద ప్రజల సొంతింటి నెలవేర్చడం కోసం టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న టిడ్కో ఇళ్లను రద్దు చేసింది. దీంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం చెల్లించిన డిపాజిట్లు వెనక్కు ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఐదేళ్ల కాళ్లు అరిగేలా తిరిగినా.. వైసీపీ ప్రభుత్వం కానీ.. అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

టీడీపీ ప్రభుత్వం హయాంలో పట్టణ మౌలిక సదుపాయల కల్పన అభివృద్ధి (టిడ్కో) ఆధ్వర్యంలో బద్వేలు పట్టణానికి సమీపంలోని తెలుగుగంగ కాలనీలో టిడ్కో గృహనిర్మాణాలు చేపట్టింది. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు రూ.25 వేలు, రూ.50వేలు, రూ.500 డిపాజిట్లను డీడీల రూపంలో చెల్లించారు. దీంతో 300, 365, 430, చదరపు అడుగుల విస్తీర్ణంలో 3 రకాల గృహ నిర్మాణాలను ప్రారంభించింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో నిర్మాణాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం టిడ్కో లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన నగదును చెల్లించలేదు. బాధితులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఎన్నిమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టిం చుకోలేదు. లబ్ధిదారులకు డబ్బులు చెల్లించకపోవ డంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. మున్సిపాలిటీ బ్యాంక్ అకౌంట్‌లో టిడ్కో లబ్ధిదారులకు సంబంధించిన డబ్బు ఉన్నప్పటికీ వారికి నగదు చెల్లించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. మొత్తం లబ్ధిదారులకు రూ.29,41,500లు నగదు రావాల్సి ఉండగా.. ఇంత వరకు ఆ ఊసేలేదు. లబ్ధిదారులు ఇంటి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టక.. డిపాజిట్ చేసిన సొమ్ములు చెల్లించక గత వైసీపీ ప్రభుత్వం తమ జీవితాల్లో చీకటి నింపిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోవడంతో డిపాజిట్ సొమ్ము చెల్లిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం...

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు డిపాజిట్లు చెల్లించిన మాట వాస్త వమే. డిపాజిట్ చేసిన లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.
-వాకమల్ల వెంకట నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బద్వేలు


పునాది దశలోనే నిలిచిపోయిన టిడ్కో గృహనిర్మాణాలు

మహిళ ఫిర్యాదుతో ఇసుక రీచ్ నిలిపివేత


ఇసుక రీచ్ నిలిపివేయడంతో ఆగిపోయిన లారీలు

సిద్దవటం, ఆగస్టు 27: మండలంలోని జ్యోతి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ఓ మహిళ ఫిర్యాదుతో తాత్కాలికంగా నిలుపుదల చేశారు. జ్యోతి గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి వెంకటసుబ్బమ్మ అనే మహిళా రైతు 143/1 , 143/2 సర్వే నెంబర్లకు చెందిన భూమి తన పేరుమీద ఉందని, ఆ ప్రాంతంలో ఇసుక రవాణా జరుగుతుందని, వాటిని నిలుపుదల చేయాలని సోమవారం రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు మురాషావలి మంగళవారం ఇసుక డంపింగ్‌యార్డు వద్దకు చేరుకుని సమస్య పరిష్కారం కోసం ఆ ప్రాంతంలో సిబ్బందితో సర్వే నిర్వహించారు. నివేదికను పైఅధికారులకు అందజేసి రెండు రోజుల్లో యదావిధిగా రీచ్‌లకు అనుమతిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

వల్లూరు, ఆగస్టు 27: మండల పరిధిలోని పాపాఘ్ని నది నుంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి మంగళవారం ఎస్ఐ సంజీవరాయుడు చర్యలు చేపట్టారు. చెరువుకిందిపల్లె, దుగ్గాయపల్లె, కట్టసమీపాన దారిలో మూసివేస్తూ ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయించారు. అక్రమంగా ఇసుక తోలితే చట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.


ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయిస్తున్న ఎస్ఐ

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

పెండ్లిమర్రి, ఆగస్టు 27: నంది మండలం వద్ద పాపాఘ్ని నది నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందిమండలం పాపాఘ్ని నది నుంచి సోమవారం రాత్రి కొంతమంది వ్యక్తులు ఎక్స్‌కవేటర్ ఉపయోగించి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి నాలుగు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కడప (క్రైం), ఆగస్టు 27 : కడప నగరం రిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న షేక్ మౌలాలి(22) అనే యువకుడు మృతి చెందాడు. రిమ్స్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు.. కడప అల్మాస్‌పేటకు చెందిన మౌలాలి స్నేహితులతో కలిసి ఈనెల 25న నగరవనం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరాడు. స్పోర్ట్స్ స్కూలు సమీపంలోకి రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు అదుపు తప్పి కింద పడిపోవడంతో మౌలాలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తేలు కాటుతో విద్యార్థి మృతి



రాజంపేటటౌన్, ఆగస్టు 27: రాజంపేట మండలం తొగురుపేట గ్రామంలో పత్తూరు హేమంత్(10) తేలు కాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. తొగురుపేట గ్రామానికి చెందిన నరసయ్య, రామసుబ్బమ్మల కుమారుడు హేమంత్ రాజంపేట పట్టణంలోని మన్నూరు ప్రియదర్శిని పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో తల్లిదండ్రులు తొగురుపేటకు తీసుకెళ్లారు. ఇంటిలో ఉండగా తేలు కుట్టింది. గమనించిన తల్లిదండ్రులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతిచెందాడు. హేమంత్ మృతితో తొగురుపేట గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



కమలాపురం రూరల్, ఆగస్టు 27: నగర పంచాయతీలోని పెద్దదర్గా వద్ద గుర్తు తెలియని వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. వృద్ధురాలు ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. అయితే మృతురాలి ఆధార్‌కార్డులో కడప చిన్నచౌకు ముత్తరాసుపల్లికి చెందిన బీగాల సాయమ్మగా అడ్రస్ ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి తెలపాలన్నారు. ఆమె బంధువులు ఎవరైనా ఉంటే సెల్: 9121100532 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

పోరుమామిళ్ల, ఆగస్టు 27 : మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు బద్వేలు కోర్టు మూడురోజులు జైలు శిక్ష విధించిందని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వంకమర్రి గ్రామానికి చెందిన బాలసాని వెంకట నారాయణ, చెన్నరెడ్డిపేటకు చెందిన చీమలదిన్నె చంద్రయ్యలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. మంగళవారం బద్వేలు మెజిస్ట్రేట్ వారికి మూడురోజులు జైలుశిక్ష విధించిందని తెలిపారు.

కారు అదుపు తప్పి బోల్తా- నలుగురికి గాయాలు

సంబేపల్లె, ఆగస్టు 27: మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి దేవపట్ల సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం కారు అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రాజంపేటకు చెందిన గాంధీ, శివ, జన బద్వేలుకు చెందిన పోల్‌రెడ్డి కారులో పీలేరుకు వెళ్తుండగా దేవపట్ల సబ్‌స్టేషన్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడటంతో గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీశారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

సిద్దవటం, ఆగస్టు 27: మండలంలోని లింగంపల్లె గ్రామానికి చెందిన గాజుల గంగయ్య హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్, సిద్దవటం ఎస్ఐ చిరంజీవిలు తెలిపారు. వారి వివరాల మేరకు... లింగంపల్లె గ్రామానికి చెందిన గంగయ్య భార్య సంధ్య, పిల్లలు యశోధ(7), జయశ్రీ(3)తో కలిసి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గంగయ్య భార్య సంధ్య అదే గ్రామంలో వాటర్ వర్క్స్ విభాగంలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న పసుపులేటి బలరాముడుతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. ఓ రోజు గంగయ్య కడపలో పెళ్లి కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి బలరాముడుతో కలిసి ఉండడం గమనించి.. తీవ్రంగా మందలించాడు. దీంతో గంగయ్యను అడ్డుతొలగించుకునేందుకు సంధ్య, ప్రియుడు బలరాముడుతో కలసి మృతుడి తలపై కొట్టి చంపారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా గంగయ్య మృతదేహాన్ని ఆటోలో తీసుకుపోయి రాయచోటి గువ్వలచెరువు ఘాట్‌లో లోయలో పడేశారు. ఆ తర్వాత ఏమి ఎరగనట్లు ఇంటికి వచ్చి.. తన భర్త అదృశ్యమైనట్లు సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, తిరుపతిలో నివాసం ఉంటున్న గంగయ్య అన్న వెంకటయ్య అనుమానం వ్యక్తం చేస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు నిందితులను అరెస్టు చేసి నిజాలు వెలికితీసినట్లు సీఐ, ఎస్‌లు తెలిపారు. గంగయ్య మృతదేహాన్ని గువ్వలచెరువు ఘాట్‌లోయలో నుంచి బయటకు తీయించి.. పోస్టుమార్టం చేశామన్నారు. నిందితులు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

ఫ్రీహోల్డ్ భూముల విచారణ పక్కాగా చేపట్టాలి : కలెక్టర్


లక్కిరెడ్డిపల్లెలో ఫ్రీహోల్డ్ భూముల గురించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె / రామాపురం, ఆగస్టు 27: ఫ్రీహోల్డ్ భూముల విచారణ పక్కాగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలో ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ భూముల సర్వే నంబర్లు పరిశీలించి రీ వెరిఫికేషన్ చెయాలన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో 487.71 ఎకరాలలో ఫ్రీహోల్డ్ భూములున్నాయని .. వందశాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఫ్రీహోల్డ్ భూముల లబ్ధిదారులతో మాట్లాడి రీ వెరిఫికేషన్‌చేయాలన్నారు. రైతులు, ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను తక్షణం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. డీకేటీ భూముల వివరాలు సేకరించి అర్హులైన వారికి పట్టాలు అందించాలన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఆర్ఐ సమ్మతూన్, వీఆర్వో వెంకోజీరావు, మండల సర్వేయర్ కరీముల్లా, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రామాపురం మండలంలోని నీలకంఠ్రావుపేట, గువ్వలచెరువు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఫ్రీ హోల్డ్ భూములను కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 70 శాతం ఫ్రీ హోల్డ్ భూములను పరిశీంచామన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజేయులకు సూచించారు. అలాగే గోపగుడిపల్లె గ్రామంలో ఫ్రీ హోల్డ్ భూములను మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ పరిశీలించారు. అనంతరం ఆయన రామాపురంలో ఉన్న సరస్వతిపల్లె సహకార బ్యాంక్‌ను తనిఖీ చేశారు. రైతులకు సంబంధించిన రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4400 ఎకరాలు ఫ్రీ హోల్డ్ భూములను గతంలో గుర్తించారని.. వాటిని పరిశీలించి అక్రమాలు జరగకుండా రైతులకు న్యాయం చేయాలని వీఆర్‌వోలకు ఆదేశించారు. తహసీల్దార్ రామాంజనేయులు, మండల సర్వేయర్ నాగలక్ష్మి, వీఆర్‌వోలు ఫాతిమా, నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సత్తా చాటిన గురుకులం విద్యార్థులు


కుస్తీపోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 27: రాష్ట్రస్థాయిలో జరిగిన కుస్తీ పోటీల్లో మండలంలోని సంజీవపురం గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మన్సూర్ అలీ తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట బాలికల హైస్కూల్లో ఆగస్టు 25, 26న జరిగిన కుస్తీ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు 16 మంది పాల్గొన్నారు. వీరిలో ఒకరు బంగారు పతకం, 12 మంది కాంస్య పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు విజయనందమూర్తి, సురేంద్రలు తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రాంగణంలో బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం విద్యార్థులు...

కమలాపురం రూరల్, ఆగస్టు 27 : స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రీడా పోటీల్లో బంగారు పతకంతో పాటు సిల్వర్ మెడల్ కూడా సాధించారని ప్రిన్సిపల్ తులసమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీల్లో రేణిగుంట జరిగిన పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన జెచందన, ప్రియ గోల్డ్ మెడల్ సాధించగా మల్లిక, పూజిత, మల్లేశ్వరి సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పాటు పీఈటి చంద్రకళావతి, ఉపాధ్యాయులు పిల్లలకు అభినందనలు తెలిపారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మంగంపేట గనుల్లో కుంభకోణంపై విచారణ చేపట్టాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసిన ఏపీ సమగ్రాభివృద్ధి అధ్యయనవేదిక అధ్యక్షుడు లక్ష్మీనారాయణ


సీఎంకు పంపిన లేఖను చూపుతున్న లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు, ఆగస్టు 27: మంగంపేట ముగ్గురాయి గనుల్లో జరిగిన కుంభకోణాలపై సత్వరమే విచారణ పూర్తి చేసి.. అవినీతి తింగలాలను శిక్షించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఏపీ సమగ్రాభివృద్ధి అధ్యయనవేదిక అధ్యక్షుడు తుంగా లక్ష్మీనారాయణ లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈనెల 23న మంగంపేట గనులకు చెందిన కార్మికులు, లారీ యజమానుల ప్రతినిధులను కలసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశామని తెలిపారు. 1961లో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీయండీసీ) ఏర్పాటు చేశారన్నారు. 1974 నుంచి మంగంపేట గ్రే బెరైటీస్ ఖనిజాన్ని ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ముడి సరుకుగా గ్రే బెరైటీస్ రాయిని లేదా పౌడర్ చేసి 30 దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. ఇది పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్ పరిశ్రమల్లో వినియోగించే కీలకమైన ఖనిజంగా పేరు గాంచిందన్నారు. అంతర్జాతీయంగా 25శాతం అవసరాలను మంగంపేట గనులు తీరుస్తున్నాయన్నారు. బెరైటీస్‌లో ఏ, బీ, సీ గ్రేడ్లు గా వర్గీకరించి ఏడాదికి దాదాపు 3 మిలియన్ టన్ను ఖనిజాన్ని వెలికి తీస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు 2022-23లో రూ.1,000 కోట్ల ఆదాయం వచ్చి నట్లు అధికారికంగానే వెల్లడించారన్నారు. అయి తే మంగంపేట బెరైటీస్ గనుల వల్ల ఆ ప్రాంతానికి జరగాల్సిన రవాణా, విదేశాలకు ఎగుమతి ద్వారా ప్రైవేటు సబ్‌లీజులు, తవ్వకాలు, రవాణా, విదేశాలకు ఎగుమతి ద్వారా ప్రైవేటు యజమానులు రాష్ట్ర ప్రభుత్వ ఖజా నాకు సమకూరాల్సిన సంపదను కొల్లగొట్టారన్నారు. వైఎస్ రాజారెడ్డితో మొదలైన ఘరానా దోపీడి నేటి వరకు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉందన్నారు. ఏ-గ్రే డు ఖనిజాన్ని బీ-గ్రేడుగా నమోదు చేయడం, ఖనిజం రవాణా చేసే సందర్భంలో తూకం వేయడంలో, వాహనాల సంఖ్య నమోదులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. ఏపీయండీసీ సంస్థలో తాత్కాలిక ఉద్యోగులుగా వందల మందిని అక్రమ పద్ధతుల్లో నియమించి వారి ద్వారా అవినీతి పనులను సాగించారని తెలిపారు. మంగంపేట బెరైటీస్ గనుల్లో మాఫియా దోపిడీకి అంతం పలకాలని.. బెరైటీస్ ఖనిజ ధర పరిశ్రమలను నెలకొల్పి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రభుత్వం కాలంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడానికి కూటమి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు.

ప్రత్యర్థుల బారి నుంచి రక్షణ కల్పించండి

● ఎస్పీకి మొరపెట్టుకున్న రాచంవాండ్లపల్లె వాసులు

రాయచోటిటౌన్, ఆగస్టు 27: గ్రామంలో ప్రత్యర్థుల బారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలంటూ సుండుపల్లె మండలం రాచంవాండ్లపల్లెకు చెందిన వల్లెపు నారాయణ కుటుంబ సభ్యులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు మొరపెట్టుకున్నారు. ఈమేరకు మంగళవారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... సుండుపల్లె గ్రామం రాచవాండ్లపల్లెకు సమీపంలో సర్వేనెంబరు 2388లో తమకు 1.31 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని వల్లెపు నారాయణ భార్య అంజనమ్మ పేరుతో డీకేటీ పట్టా కూడా రెవెన్యూ అధికారులు ఇచ్చి ఉన్నారని తెలిపారు.
అయితే తమ భూమి పక్కన ఉన్న వారు మా భూమిలో నుంచి దారి కావాలని ఘర్షణకు దిగుతూ, తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వల్లెపు నారాయణ కుటుంబ సభ్యులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

మల్లూరు విద్యార్థుల ప్రతిభ

చిన్నమండెం, ఆగస్టు27: ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీల్లో మల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల బృందం నాట్య విభాగంలో ప్రథమ స్థానం, యువగళ గీతనాట్యంలో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం పొంది ప్రతిభ చాటారు. వీరికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. క్రీడా విభాగంలో ప్రతిభ కనపర్చిన 9వ తరగతికి చెందిన షాహిన్‌తాజ్, అమృత వాసవి సంధ్య సుప్రజల బృందం, పదవ తరగతికి చెందిన తేజశ్రీ కృపామణి చందన భువనేశ్వర్‌రెడ్డి, ప్రసన్న, రేఖ, 8వ తరగతికి చెందిన జాహ్నవి, హిమజ, అనూషలను మంత్రి ప్రశంసించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రామచంద్ర, ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

చిన్నమండెం, ఆగస్టు 27: మండల కేంద్రంలోని స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రధానంగా దృష్టి లోపాలు ఉండకూడదని, వాటిని సకాలంలో గుర్తించి సరైన సమయంలో చికిత్స చేయించాలన్నారు. కాగా ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు 750 మంది విద్యార్థులకు విడతల వారీగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించారు. అవసరమైన మందులను సరఫరా చేస్తామని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సురేశ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎస్‌పీవో నవీన్‌కుమార్, ఎన్ఎంలో అనిత, హైమావతి నాగరాణి, భారతి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యుత్ కార్మికుల సమస్యలను తీర్చండి'

రాజంపేటటౌన్, ఆగస్టు 27: రాజంపేట సబ్‌డివిజన్ పరిధిలో చేస్తున్న తాత్కాలిక విద్యుత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈఈ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం యూఈఈసీడబ్ల్యూఎస్ యూనియన్ నాయకులతో కలిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎఫ్, ఈఎస్ఐ 8 నెలలుగా చెల్లించని కార్మికులకు తక్షణమే చెల్లించాలని వారు కోరారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని కార్మికుల సమస్యలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి రవికుమార్, సుబ్రమణ్యంరాజు, బాలక్రిష్ణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో దృష్టిని ప్రసాదించండి : డాక్టర్

రాజంపేటటౌన్, ఆగస్టు 27: నేత్రాలు ప్రతిఒక్కరికి ప్రధానమని, వాటిని సంరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఆకేపాడు ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ అశ్విని చంద్ర పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో పలు కరపత్రాలు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు వి.చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌వో రాజమ్మ, పీహెచ్ఎన్ ఇందిరా, సూపర్‌వైజర్ రవి, శివ ప్రసాద్‌రాజు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో చీకట్లు.. ప్రజలకు ఇక్కట్లు

- కనిపించని వీధి దీపాలు
- ఐదేళ్లుగా చిమ్మ చీకటిలోనే గ్రామస్తులు



సుండుపల్లి ప్రధాన రహదారిలో వీధిదీపాలు వెలగక చీకటిగా ఉన్న దృశ్యం

సుండుపల్లి, ఆగస్టు 27: గ్రామ పంచాయతీలలో వీధిదీపాల నిర్వహణ దయనీయంగా మారింది. గత ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో గ్రామాలు చిమ్మచీకట్లలో ఇబ్బందులు పడ్డాయి. సాయంత్రం 7 తర్వాత వృద్ధులు, చిన్నారులు బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ గ్రామాలకు వీధిలైట్ల వెలుగులు వచ్చేనా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలలో విద్యుదీపాల సమస్య ఉంది. విద్యుత్ ఆదాతో పాటు పంచాయతీలపై నిర్వాహణ భారం తగ్గించేందుకు స్తంభాలకు ఎల్ఈడీ దీపాలు బిగించారు. నిర్వహణ బాధ్యతలను ఇంధన సామర్థ్య సేవల సంస్థకు అప్పగించారు. ఎల్ఈడీ దీపాల వినియోగం ద్వారా ఆదా అయిన సొమ్ము వాయిదాల రూపంలో లైట్లు సరఫరా చేసే సంస్థకు చెల్లిస్తే సరిపోతుందని అధికారులు అప్పట్లో చెప్పారు. కొంతకాలం పాటు సక్రమంగా నిర్వహించినా ఆ తర్వాత చేతులెత్తేశారు. దీంతో ఇవి ఎక్కడి కక్కడ మూలనపడ్డాయి. వీటి స్థానంలో తిరిగి చిన్న బల్బులు కొనుగోలు చేశారు. గతంలో వాడిన ఎల్ఈడీ దీపాలకు చేసిన ఖర్చును వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నుంచి తీసుకుంది. అయితే గ్రామాలలో విద్యుత్ దీపాలు లేక ప్రజలు రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

ఒక్క రూపాయి ఇచ్చింది లేదు

వైఎస్ జగన్ 2019లో అధికార పీఠం ఎక్కిన తరువాత గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి ఇచ్చింది లేదు. రేండేళ్లుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా సర్పంచులు, అధికారులకు తెలియకుండా దారి మళ్లించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడా కనీస అభివృద్ధి లేకుండా పోయింది. వీటిలో అధిక భాగం విద్యుత్తు చార్జీల రూపంలో తిరిగి రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. మిగిలిన వాటిలో దీపాల నిర్వహణ పేరుతో మరికొంత తీసేసుకుంది. దీంతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేక పోతున్నామని సర్పంచులు వాపోతున్నారు.

వీధి దీపాలు లేక ఇబ్బందులు
- ఏటూరి యల్లయ్య, కృష్ణానగర్



వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాము. ఎప్పుడో నాలుగేళ్ల కిందట వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అవి ఎప్పుడో పాడైపోయాయి. అప్పటి నుంచి కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. వీధిలో మట్టిరోడ్డు, ఇళ్లచుట్టూ కంప చెట్లు ఉన్నాయి. విషసర్పాలు ఇళ్ల ముందుకు వస్తున్నాయి. దీపాలు వేసి పుణ్యం కట్టుకోండి.

వీధి దీపాల ఊసే లేదు
- అంజనమ్మ, పాపన్నగారిపల్లి



వీధి దీపాలు లేక పల్లెలో ఇబ్బందులు పడుతున్నాము. సాయంత్రం 7 అయితే చిమ్మ చీకట్లు. వీధుల్లోకి రావాలంటే భయమేస్తోంది. వర్షం పడితే ఇంట్లో నుంచి అడుగు బయట పెట్టలేము. ఉన్న వీధి దీపాలు పాడైపోయాయి. మరికొన్ని మరమ్మతులకు నోచుకోలేదు.

పట్టించుకునే నాథుడే లేరు
- మూడే నాగిలమ్మ, భైరవ గుట్ట



ఐదు సంవత్సరాలుగా వీధిదీపాల సమస్య ఉంది. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఉన్న వీధిదీపాలు పాడైపోయి తుప్పు పడుతున్నా అధికారులు పట్టించుకోరు. గుట్ట దిగువ భాగంలో ఉన్నందున పాములు, పురుగులు వస్తున్నాయి. వీధిదీపాలు ఏర్పాటు చేసి పుణ్యం కట్టుకోండి.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

- రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 27: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు నడిపే వారికి ఖచ్చితంగా లైసెన్సుతో పాటు డ్రెస్‌కోడ్ ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా కఠిన శిక్ష తప్పదన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా డ్రైవర్లు వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.

ఎయిడ్స్‌పై యువతకు అవగాహన ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 27: ఎయిడ్స్‌పై యువత అవగాహన పెంచుకోవాలని డీఆర్‌పీ అల్లావళి పేర్కొన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్క్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలల్లో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, చదువుకొనే సమయంలో యువత చెడుదారి పట్టకుండా సత్‌ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి వల్ల మనిషి క్షీణించిపోతారని, అనుమానాలున్న వారు 1097కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, బయాలజి ఉపాధ్యాయురాలు విజయ, ఎల్‌టీ నరసింహులు, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

చిట్వేలి, ఆగస్టు 27: మండల పరిధిలోని స్తంభారాయుడు ఆలయ సమీపాన నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి నందలూరు మండలం కుమ్మరపల్లె ఇసుకపల్లె వాసులు పోలి నాగరాజు కుటుంబ సభ్యులు ఆలయానికి రూ.లక్షా 11 వేల 111 విరాళంగా అందించారు. అలాగే మంగళవారం ఓబులవారిపల్లెకు చెందిన పోలి సురేష్‌రెడ్డి, రాజమ్మ కుమార్తె హర్షిత, కుమారుడు మణీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం నిర్వహించారు. అనంతరం శివాలయంలో మకరతోరణానికి గానూ రూ.59 వేలను ఆలయ నిర్మాణ దర్మకర్త కట్టా రామ్మోహన్‌రావుకు అందజేశారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 27: రాయచోటి నియోజకవర్గంలో శాశ్విత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రాయచోటి నియోకవర్గ పరిధిలోని గాలివీడు మండలంలోని అరవీడు, చిన్నమండెం మండలంలోని కలిబండ గ్రామాల్లో నూతన బోరు వేశామని, అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా 40 బోర్లు వేసినట్లు తెలిపారు. గతంలో రాయచోటి ప్రాంత ప్రజలు నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గంలో ఎక్కడా నీటి సమస్య ఉండకూడదనే ఉద్దేశ్యంతో అవసరమైన చోట బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం నియోజకవర్గ పరిధిలోని గాలివీడు, చిన్నమండెం మండలాల్లో నూతన బోర్లు వేసి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు.

ట్రస్ట్ సేవలు మరువలేనివి : ఎంఈఓ



విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ భయ్యారెడ్డి, తదితరులు

గాలివీడు, ఆగస్టు 27: ప్రజలకు సేవ చేయడంలో కానాల ఇరగమ్మ మెమోరియల్ ట్రస్టు సేవలు మరువలేనివని ఎంఈఓ పిల్లి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం రిటైర్డ్ లెక్చరర్, న్యాయవాది కానాల భయ్యారెడ్డి సతీమణి దివంగత ఇరగమ్మ పదవ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భయారెడ్డి భార్య జ్ఞాపకార్థం ఆమె పేరు మీద ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం ఈ ట్రస్టు ద్వారా నూలివీడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నగదు బహుమతులను అందజేయడంతో పాటు వివిధ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, ప్లేట్లను అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం పందికుంట పంచాయతీలోని ఎస్టీ తాండాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితరవి అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ యోగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సౌభాగ్యమ్మ, మనోహర్‌రెడ్డి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో సాంకేతిక జోడింపు అవసరం

- ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ కే.గోపాల్

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 27: ఉద్యాన సాగులో సాంకేతిక జోడింపు అవసరమని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని ఉద్యానవర్సిటీలో సాంకేతిక అంశాల ద్వారా సుస్థిర ఉద్యాన సాగు అనే అంశంపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా మిశ్రమ అభ్యాసన ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తరగతులను నిర్వహించారు. అనంతరం వర్సిటీ పీజీ డీన్ ఎస్.సుర్యకుమారి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్, కూరగాయల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, డాక్టర్ సూదీప్ మార్య, ఐసీఏఆర్-ఐఏఎస్ఆర్ఐ, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, అధ్యాపకులు ప్రదీప్‌కుమార్, క్రాంతిరేఖ, శశికళ ప్రసంగించారు. డాక్టర్ యువరాజ్, జీ.శారద, సీహెచ్.రూత్, స్వరాజ్యలక్ష్మి, శ్యాంసుందర్ రెడ్డి, కే.లలిత, జయప్రద, సురేంద్రరెడ్డి, డాక్టర్ హరిమల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలి

- యూటీఎఫ్ జిల్లా నేతల డిమాండ్

రాయచోటిటౌన్, ఆగస్టు 27: ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్.జాబీర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం వారు డీఈఓ కార్యాలయంలో డీఈవో శివప్రకాశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలనే డిమాండ్‌తో గత ప్రభుత్వంపై పోరాటాలు చేశామని, ఈ పోరాటాల ఫలితంగానే నేటి కూటమి ప్రభుత్వం మరుగుదొడ్ల ఫోటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. కానీ ఆ ఫొటోలు ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ అసిస్టెంట్లు తీయకపోతే అందుకు బాధ్యత ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనని చెప్పడం సరికాదన్నారు. దీనికి తోడు ప్రతిరోజు సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ ప్రధానోపాధ్యాయులు పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని చెప్పడంలో ఆంతర్యమేమిటన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేందర్‌రెడ్డి, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి షేక్.షఫీజుల్లా, నాయకులు రాజబాబు, షానవాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది : చమర్తి

రాజంపేట, ఆగస్టు 27: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఎళ్లవేళలా అండగా నిలుస్తుందని పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేవారని, ఆ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించేలా చేస్తామన్నారు. ఈ శిక్షణ తరగతుల వల్ల రాష్ట్రంలో ప్రమాదాలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, జిల్లా కార్యదర్శి శేఖర్, డిపో కార్యదర్శి మౌలా, అధ్యక్షుడు సుబ్బయ్య, ఉద్యోగులు రమణ, చంద్ర, బాషా, బాలాజీ, పుల్లయ్య, మోహన్, మురళీ, కృష్ణయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

రామాపురం, ఆగస్టు 27: రామాపురం ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు రామాపురం ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనివాసులుగౌడ్ అన్నారు. రామాపురంలో గత కొన్ని రోజులుగా తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ప్రజలు తమ దృష్టికి తేవడంతో వెంటనే ఆయన స్పందించి తన సొంత నిధులతో మంగళవారం బోరు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు అంజనారెడ్డి, అయోధ్యాపురం పట్టాభిరెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, చిలేకాంపల్లె శివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, చప్పిడి రాంమోహన్, చప్పిడి వెంకటేశ్, చప్పిడి కృష్ణమూర్తి, గంగిరెడ్డి, వెంకటేశ్ (అయ్యప్ప), పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లతోనే మండలాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

- సుగవాసికి రైతుల ఘన స్వాగతం



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

సుండుపల్లి, ఆగస్టు 27: రోడ్లతోనే మండలాలు, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతుల పిలుపు మేరకు రోడ్డు ఏర్పాటు స్థలాన్ని ఆయన పరిశీలించారు. పొలం ఉన్న రైతులందరూ ఒప్పుకుంటేనే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మంచి రేట్లు రావడంతో పాటు మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు వుండవన్నారు. ఈ రోడ్డు ఏర్పాటు పనులు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా చేద్దామన్నారు. ఆలస్యమైనా పర్వాలేదు ప్రతి రైతుకు మంచి జరిగేలా చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, ఎంపీడీవో రామచంద్ద, ఎస్ఐ శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, శివకుమార్ నాయుడు, చెన్నంశెట్టి వెంకట్రమణ, వెంకటేశ్వర్లునాయుడు, దామోదర్‌నాయుడు, యర్రం రెడ్డి, నాగేశ్వర జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ బెల్లాల రమణ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి పట్టణం శెట్టిపల్లి గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



పవన్ వ్యాఖ్యలపై హర్షం

రాజంపేట, ఆగస్టు 27: గ్రామ పంచాయతీలో ఆక్రమణకు గురైన భూములను తిరిగి తీసుకురావడానికి ప్రత్యేక చట్టం తీసుకువస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఆలోచన మంచిదని త్వరలోనే నిర్ణయాన్ని అమలు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆది నారాయణ, రమణ, నాగరాజు, పి.రమణ, పి.సూర్యచంద్ర, పుల్లయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి, ఆగస్టు 27: మండల కేంద్రంలో అక్రమంగా అమ్ముతున్న 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జనసేనలో భగ్గుమన్న విభేదాలు

- మూడు నెలలుగా ఇరువర్గాల రభస



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన అమర్‌నాథ్

రైల్వేకోడూరు, ఆగస్టు 27: కోడూరు జనసేన పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. మూడు నెలలుగా ఇరువర్గాల మధ్య పొసగడం లేదు. దీంతో మంగళవారం కోడూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో ఘర్షణ చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... తాను రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో మీసేవ వద్ద నిలుచుని ఉండగా మైసూరివారిపల్లెకు చెందిన జనసేన నాయకులు పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్‌లు తనపై అకారణంగా దాడి చేసినట్లు అదే పార్టీకి చెందిన అమర్‌నాథ్ పేర్కొన్నాడు. తనను నోటికి వచ్చినట్లు దుర్భాషలాడారని, చొక్కా పట్టుకుని దాడి చేయడంతో పరుగులు తీసి పోలీసులను ఆశ్రయించానన్నాడు. ఈ విషయమై తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా, కంప్లైంట్ తీసుకోలేదని విలేఖర్లకు వివరించాడు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్నానని, తనను కాళ్లతో తన్నడంతో గుండెల్లో నొప్పిగా ఉందన్నాడు. పైగా తన మెడలో ఉన్న 5 తులాల బంగారు చైన్ కూడా లాక్కున్నట్లు బాధితుడు ఆరోపించాడు. రైల్వేకోడూరులో జరుగుతున్న తంతుపై పవన్‌కళ్యాణ్‌కు వివరిస్తామని తెలిపారు. 12 ఏళ్లుగా పార్టీ జెండాలను పట్టుకుని పని చేసినందుకు బుద్ధి చెప్పారని, ఈ నెల 23న మైసూరివారిపల్లెకు ఉప ముఖ్యమంత్రి వచ్చినా తనకు కనీస సమాచారం అందించలేదని అమర్‌నాథ్ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిలకు వివరించినా స్పందించలేదని మీడియా ముందు చెప్పుకొచ్చారు. దీనిపై పోలీసులు ఫిర్యాదు తీసుకోకుంటే డీఎస్పీ, ఎస్పీని ఆశ్రయిస్తామని తెలిపారు. పార్టీకి కష్టపడినందుకు చావుదెబ్బలు తినాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. అకారణంగా, అన్యాయంగా దాడి చేసిన వారిపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌన్సెలింగ్‌కు రమ్మని సమాచారం అందించా : ఎస్ఐ

ఘర్షణపై బాధితుడు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మాట వాస్తవమే. అయితే ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు రమ్మని సమాచారం అందించా. వారు వచ్చిన వెంటనే వాస్తవాలు తెలుసుకుని ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు.

కాణిపాకంలో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు


గోవుకు చెరకు పెడుతున్న ఇన్‌చార్జి ఈవో వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 27: కాణిపాక క్షేత్రంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఆలయ అధికారులు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాణిపాకానికి చెందిన ఎ.ధనంజయయాదవ్, ఎస్.రాజేంద్ర యాదవ్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ప్రధాన ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఆలయ ఇన్‌చార్జి ఈవో వాణి, సిబ్బంది పూజా సామగ్రిని గోశాలకు తీసుకొచ్చారు. గోశాలలో గోవు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. గోశాల పూర్తిగా మామిడి తోరణాలు, అరటి బోదెలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్ర ఘోష నడుమ గోవులకు పూజలు చేశారు. ఏటా కృష్ణాష్టమి రోజున గోవులకు అరటి పండు, దాణా, చెరకు ఆకు పెట్టడం ఆనవాయితీ. అనంతరం గోశాల ప్రాంగణంలో అధికారులు ఉట్టి కొట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. కాణిపాకానికి చెందిన చిన్నారులు గోపిక, శ్రీకృష్ణ వేషధారణలతో అలరించారు. మండలంలోని మలారపల్లెలోని గోశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి తదితరులు పాల్గొన్నారు.


వేణుగోపాలుడి ఊరేగింపు


ఆలయం ఎదుట ఉత్సాహంగా ఉట్లోత్సవం

భక్తిశ్రద్ధలతో గోకులాష్టమి

వెదురుకుప్పం, ఆగస్టు 27: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగవారం గోకులాష్టమి వేడుకలను ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, అర్చన కార్యక్రమాలు జరిపించారు. తర్వాత భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో నిర్వహించారు. సాయంత్రం పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య ఉట్లోత్సవం నిర్వహించారు. రాత్రి శుద్ధి తరువాత ఏకాంత సేవ చేయించారు. టీడీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, బాబు సురేష్, ప్రధాన అర్చకులు గోపాల ఆచార్యులు, శబరి, రమేష్, భక్తులు హాజరయ్యారు.

అమాంతం పెరిగిన కొబ్బరి ధరలు


వెంగళ్రాజుకుప్పంలో కొబ్బరికాయలకు పొట్టు తీస్తున్న కూలీలు

పాలసముద్రం, ఆగస్టు 27: కొబ్బరిధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఏడాదిగా కొబ్బరిధర ధర స్థిరంగా ఉంది. వెయ్యి కాయల ధర రెండు వారాల క్రితం వరకు రూ.8000-8500 మధ్య పలికేది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ధరలు అమాంతం పెరిగాయి. వెయ్యి కాయల ధర రూ.11వేల నుంచి రూ.12వేల వరకు పలుకుతోంది. తక్కువ ధరలు ఉన్నప్పుడు వ్యాపారులు ముందుచూపుతో కొనుగోలు చేసి నిల్వచేసుకున్నారు. ప్రస్తుతం రైతుల దగ్గర ఎక్కువ కాయలు లేవు. వినాయక చవితి నేపథ్యంలో కొబ్బరి ధర మరింత పెరిగే అవకాశముందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్ళుగా కొబ్బరితోటలకు నల్లి సోకడం వల్ల కాయల దిగుబడి తగ్గింది. తమిళనాడులోని షోలింగర్, చెన్నై, ఆర్కాడు వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు రోజూ వచ్చి కొబ్బరికాయలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



పుంగనూరు రూరల్, ఆగస్టు27: అక్రమ మార్గంలో తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటు సారాను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీధర్ రావు తెలిపారు. పుంగనూరు పట్టణం భగత్‌సింగ్ కాలనీ సమీపంలో మంగళవారం 5728 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని, 230 లీటర్ల నాటుసారాను ఎక్స్‌కవేటరుతో తొక్కించి ధ్వంసం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు అర్బన్‌సీఐ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

● 12 మందికి గాయాలు


ప్రమాదానికి గురైన వాహనం


గాయపడిన వారు

బంగారుపాళ్యం, ఆగస్టు 27: బంగారుపాళ్యం మండలం.. చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలోని మొగిలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొందరు కాణిపాకం ఆలయానికి కారులో బయలుదేరారు. మొగిలి వద్దకు చేరుకోగానే చిత్తూరు వైపు వెళ్తున్న గూడ్స్ క్యారియర్ లారీ వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నిర్మల, క్రిష్ణమ్మ, నల్లక్క, లక్ష్మీదేవి, ఐశ్వర్య, ధనలక్ష్మి, ఓబులమ్మ, వెంకటరమణమ్మ, లీలావతి, రామలక్ష్మి, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వళ్లెమ్మ తెలిపారు.

భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకోవాలి

రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే క్రిమినల్ కేసులు

జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: 'ప్రధాని మోదీ కలలు కంటున్న వికసిత్ భారత్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానం నుంచి 2029 నాటికి మూడో స్థానం చేరుకోవాలి. ఈ విషయంలో పన్ను చెల్లింపుదారుల సహకారం అవసరం' అని జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ తెలిపారు. తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం ఉండాలనే 33 రకాల సెస్సులు, 17 రకాల పన్నులు రద్దు చేసి.. జీఎస్టీ అమలు చేశారని గుర్తుచేశారు. జీఎస్టీ ఆడిట్ ద్వారా దేశ వ్యాప్తంగా రూ.2,676 కోట్లు పన్నులు ఎగవేసినట్లు గుర్తించగా.. అందులో రూ.272 కోట్లు రికవరీ చేసినట్లు ప్రకటించారు. రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇటీవల ఓ ఎరువుల వ్యాపారి చెల్లించాల్సిన రూ.1300 కోట్లు ఎగవేస్తే అతడికి నోటీసులు జారీ చేశామని, ఇందులో రూ.20 లక్షలు సబ్సిడీ ఇవ్వడం జరిగిందన్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా పన్నులు చెల్లించని వారికోసం కేంద్ర ప్రభుత్వం వడ్డీ, అపరాధ రుసుం చెల్లింపులో మినహాయింపు ఇచ్చిందన్నారు. వికసిత్ భారత్‌తో ఇప్పటి వరకు భారత ప్రభుత్వం వివిధ రంగాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.11 లక్షల కోట్లు విడుదల చేయడం జరిగిందని వివరించారు. అందులో భాగంగా ఏపీకి మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.65,000 కోట్లు విడుదల చేసిందన్నారు.

అనంతపురం, కర్నూలులో సబ్ ఆఫీసులు

జీఎస్టీ ఆడిట్ సబ్ ఆఫీసులు కొత్తగా అనంతపురం, కర్నూలులో ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జీఎస్టీ అమల్లోకి రాకముందు 70 లక్షల మంది పన్నుచెల్లింపుదారులు ఉండగా, ఇప్పుడా సంఖ్య 140 లక్షలకు చేరిందన్నారు. డిసెంబరులోగా దేశంలోని 532 యూనిట్లు ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పారు. గతంలో సిగరెట్లపైన 300 శాతం పన్ను చెల్లిస్తుండగా ప్రస్తుతం 35 శాతమే పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం, సూపర్ మాల్స్‌కు పన్నులు లేవన్నారు. తిరుపతి జీఎస్టీ ఆడిట్ జాయింట్ కమిషనర్ అంబి, అసిస్టెంట్ కమిషనర్ మాలతి, జీఎస్టీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టండి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 27: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగ సంక్షేమశాఖల వసతిగృహాల్లో విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంక్షేమశాఖల వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలతో ఆయన సమావేశమయ్యారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో వసతిగృహాలలో చేర్పిస్తుంటారని, అలాంటి వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రెసిడెన్షియల్ వసతి గృహాల్లో ప్రతిరోజు రాత్రి ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలన్నారు. ఏఎస్‌డబ్ల్యూవోలు నెలకు 12 వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. రామకుప్పం మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఎత్తు ప్రదేశంలో ఉండటం, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రొవిజన్స్, గ్యాస్ తదితర వాటిని తీసుకురావడానికి వెండర్స్ ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ చెప్పగా.. సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా శాఖల పరిధిలోని వసతి గృహాలు, ఎంతమంది విద్యార్థులు ఉన్నారనే వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల డీసీటీవో పద్మజ, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనం టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ ఆపాలి

ద్రావిడ వర్శిటీ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి ● జగన్‌కంటే చంద్రబాబు పాలన బాగుందన్న చింతా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

కుప్పం, ఆగస్టు 27: ఏడుకొండల మీద వెంకన్న బ్రేక్ దర్శనం టికెట్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం దారుణమని మాజీ ఎంపీ చింతా మోహన్ విమర్శించారు. ఇప్పటికే వీఐపీలపాలైన ఈ టికెట్లు బ్లాక్ మార్కెటింగ్ దందాలో తగులుకుని సామాన్యులకు అందని ఎత్తులో నిలిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ అధికారులతోపాటు కొంత మంది ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రమేయం ఇందులో ఉందని ఆరోపించారు. వెంటనే సీఎం చంద్రబాబు స్పందించి, బ్రేక్ దర్శనం టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ ముఠాను గుర్తించి, బాధ్యులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వత్తాసు పలుకుతూ చంద్రబాబు ఎస్సీల పట్ల విభజించు పాలించు సూత్రాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. అయితే జగన్ పాలనకన్నా చంద్రబాబు పాలన ఎంతో బాగుందని మెచ్చుకున్నారు. అమరావతి జపం మాని రాష్ట్రమంతా సమ అభివృద్ధికోసం పాలన సాగించాలని కోరారు. కుప్పంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, ఇప్పటికీ స్థానికులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. స్థానికంగా పరిశ్రమలు స్థాపించి, ఉపాధి అవకాశాలను కల్పించి యువతను ఆదుకోవాలని కోరారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో సుమారు 250 మంది ఉద్యోగులకు 13 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వారంలోగా వారికి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటింటికీ సహజవాయువు

ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ ఎండీ


మీడియాకు వివరాలు తెలియజేస్తున్న అఖిలేష్ గుప్తా

తిరుపతి అర్బన్, ఆగస్టు 27: విద్యుత్ తరహాలోనే సహజవాయువు(నేచురల్ గ్యాస్)ను త్వరలో ఇంటింటికీ సరఫరా చేయనున్నామని ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ ఎండీ, సీఈవో అఖిలేష్‌గుప్తా వెల్లడించారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.3,500కోట్ల పెట్టుబడితో సమగ్ర గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్ అభివృద్ధి జరుగుతోందన్నారు. సిలిండర్ల రూపంలో కాకుండా పైపులైన్ల ద్వారా శ్రీసిటీ పరిశ్రమ భాగస్వామ్యంతో తక్కువ ధరలకు, పర్యావరణ రహిత సహజవాయువును అందించడమే తమ లక్ష్యమన్నారు. గృహ అవసరాలకే కాకుండా వాణిజ్యపరంగానూ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. సాధారణ గ్యాస్‌తో పోలిస్తే 20శాతం తక్కువగా ధరలకే విక్రయిస్తామన్నారు. వినియోగాన్ని అనుసరించి ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలకు, ఉద్యోగుల వాహనాలకు, గృహ అవసరాలకు సహజవాయువును అందిస్తున్నామని గుర్తు చేశారు. రెండో దశలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో సరఫరా చేయడానికి ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. రీజనల్ హెడ్ గౌతమ్‌ఆనంద్ సహజవాయువు మాట్లాడుతూ.. తిరుపతి నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 80562 13276 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం


స్విమ్స్‌లో విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 27: స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 26 సీట్లకుగాను మంగళవారం తొలుతగా ఆరుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను డైరెక్టర్ ఆర్వీకుమార్ అందజేశారు. వీరంతా నీట్ ఆలిండియా కోటాలో ర్యాంకులు సాధించిన పలు కేటగిరీలకు చెందిన విద్యార్థులు. అడ్మిషన్లు పొందిన వారిలో.. ఏపీ, ఢిల్లీ, జమ్మూకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులున్నారు. ప్రిన్సిపాల్ ఉషా కళావత్, ఏడీ శశికళ, సూపరింటెండెంట్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో..: ఎస్వీ వైద్య కళాశాలలోనూ మంగళవారం ఐదుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అందజేశారు. కళాశాలలో 240 సీట్లకుగాను తొలిరోజున హర్యానా, మహారాష్ట్ర, కేరళకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు ఢిల్లీకి చెందిన ఇద్దరు విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఊరందూరు టీచరుకు జాతీయ అవార్డు

తన కష్టానికి గుర్తింపు లభించిందన్న సురేష్



డిజిటల్ రూపంలో పాఠాలు బోధిస్తున్న కూనాటి సురేష్

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 : అవార్డుల కోసం తాను పని చేయలేదని, అయితే జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యానని తెలిసినప్పుడు తన శ్రమకు తగ్గ గుర్తింపు లభించినట్లు భావించానని సోషల్ టీచర్ కూనాటి సురేష్ చెప్పారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన సురేష్ తన సొంత మండలంలోని ఊరందూరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూనే విద్యా రంగానికి ఎన్నో విశేష సేవలను అందించారు. ఆయన విశేష సేవలను రాష్ట్రప్రభుత్వం గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రకటించింది.సెప్టెంబరు 5న ఢిల్లీలో జరిగే జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సురేష్ పురస్కారం అందుకోనున్నారు. రాష్ట్రం నుంచీ ఇద్దరే ఈ అవార్డుకు ఎంపికయ్యారు.పాఠ్యపుస్తకాలను రూపొందించడం, మారుతున్న సాంకేతిక విధానాలకు అనుగుణంగా డిజిటల్ కంటెంట్ క్రియేట్ చేయడం, ఉచిత పాఠ్యాంశాలను బోధించే మొబైల్‌యాప్ ఉచితంగా అందించడం వంటి ఎన్నో సేవలను ఆయన విద్యార్థులకు చేరువ చేశారు. విద్యార్థులకు అవసరమైన వర్క్‌బుక్కులతో పాటు పిక్టోరియల్ సోషల్ స్టడీస్ అనే పుస్తకం ద్వారా దాదాపు వెయ్యి చిత్రాలను, మ్యాపులతో కూర్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తయారు చేసి ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు విజయోస్తు, విజయ సాధన సంకల్పం, మహా సంకల్పం, విజయ స్ఫూర్తి పేర్లతో మెటీరియల్ తయారు చేసి సాంఘిక శాస్త్ర ఫలితాల్లో అగ్రభాగాన ఉండేందుకు కృషి చేశారు.విద్యాపరమైన శిక్షణా తరగతుల్లో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.డ్రాపౌట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులను తరచూ కలిసి వారిని మళ్లీ పాఠశాలకు పంపించేలా కౌన్సెలింగ్ ఇచ్చారు.డిజిటల్ మ్యాపులు తయారు చేసి ఉపాధ్యాయులందరికీ ఉచితంగా పంచిపెట్టారు.ఈయన ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తరపున జాతీయ ఉత్తమ ఐసీటీ ఉపాధ్యాయ అవార్డు, ఆంధ్ర రత్నం అవార్డు, గ్లోబల్ బెస్ట్ టీచర్ అవార్డు, బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కార్ , గురుమిత్ర అవార్డు, జిల్లాస్థాయిలో రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రావీణ్య ఫౌండేషన్ ప్రత్యేక గుర్తింపు అవార్డు అందుకొని వుండడం విశేషం.

అమర ఆస్పత్రిలో తెగిన బొటనవేలికి శస్త్రచికిత్స


శస్త్రచికిత్స ద్వారా అతికించిన వేలును చూపుతున్న బాధితుడు

రేణిగుంట, ఆగస్టు 27: ప్రమాదవశాత్తు తెగిపడిపోయిన బొటనవేలును శస్త్రచికిత్స చేసి అతికించినట్లు అమర ఆస్పత్రి డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన చిన్నారెడ్డికి ప్రమాదవశాత్తూ బొటనవేలు తెగిపోయిందన్నారు. ఐస్‌బాక్సులో బొటనవేలిని భద్రపరిచి నాలుగు గంటల లోపు ఆస్పత్రికి తీసుకువచ్చారని, దాదాపు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి తెగిన బొటనవేలిని అతికించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో యథాతథంగా బొటనవేలు పనిచేస్తుందన్నారు. ఇప్పటికే అమర ఆస్పత్రిలో ఇలాంటి 25 శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ వాసుదేవరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాజన్న ఫౌండేషన్‌కు

సీఎస్ఆర్ టైమ్స్‌గోల్డ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, ఆగస్టు 27: అమరరాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్ నైపుణ్యాభివృద్ధి విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన సీఎస్ఆర్ టైమ్స్ గోల్డ్ అవార్డు దక్కించుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఫౌండేషన్ అందించిన సేవలను గాను గోవా రాజ్‌భవన్‌లో జరిగిన నేషనల్ సీఎస్ఆర్ సమ్మిట్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా మంగళవారం ఫౌండేషన్ అధికారి సతీష్ రాళ్లపల్లి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, 2014లో స్థాపించిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 2వేలమంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి అమరరాజా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. ఈ వివరాలను మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 76,910 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,320 మంది తలనీలాలు సమర్పించినట్లు పేర్కొంది.

వంకను పూడ్చిన రియల్టర్లు



తుమ్మలవంక నీరు ప్రవహించే తూములను మట్టితో పూడ్చివేసిన దృశ్యం

● రూ.3కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా
● అనుమతిలేని లేఅవుట్‌లో పీకేఎం-ఉడా నోటీసు బోర్డు

మదనపల్లె టౌన్, ఆగస్టు 27: మదనపల్లెలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఓ వైపు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తూ ఏకంగా వంక పోరంబోకు భూమిని ఆక్రమించేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన 70 సెంట్ల వంకను మట్టితో పూడ్చివేసి నామరూపాల్లేకుండా చేసేశారు.

మదనపల్లె మండలం పొన్నేటిపాళెం గ్రామం చిప్పిలి వద్ద ఏడు సర్వే నెంబర్లలో సుమారు 25 ఎకరాల పట్టా భూమి వుంది. ఇటీవల కర్ణాటకకు చెందిన కొంత మంది వ్యక్తులు, మదనపల్లెలోని కొందరితో కలసి ఈ భూమిని 42 మంది నుంచి కొనుగోలు చేస్తున్నట్లు అగ్రిమెంట్లు చేసుకున్నట్లు సమాచారం. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో బెంగళూరు రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమిని వెయ్యి టిప్పర్ లోడ్ల మట్టితోలి చదును చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ శ్రీహరి అక్కడికి వెళ్లి లేఅవుట్‌కు అనుమతి తీసుకోవాలని నోటీసులు జారీ చేశారు. తాము ఆ భూమిలో మొక్కల పెంపకం చే ఎడతామని, ప్లాట్లు వేయలేదని రియల్టర్లు చెప్పడంతో అధికారులు వెనుతిరిగారు. కాగా, వారం రోజులు ఇదే భూమిలో వెంచర్ వేస్తున్నట్లు అవసరమైన వారు ప్లాట్ల కొనుగోలుకు తమను సంప్రదిం చాలని పెద్ద బోర్డు పెట్టడంతో పాటు రంగురంగుల జెండాలను నాటారు. ఈ విషయం తెలుసుకున్న పీకేఎం-ఉడా వైస్‌చైర్మన్ బాబర్, ఆర్‌ఐ రెడ్డెప్ప, ఇన్‌చార్జి ఈవోఆర్డీ శ్రీహరి, వీఆర్వో నారాయణ అక్కడికి వెళ్లి పరిశీలించారు. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని వ్యవ సాయేతర భూమిగా మార్చుకోవాలంటే రెవెన్యూ శాఖకు కన్వర్షన్ చార్జీలు చెల్లించాల్సి ఉండగా అటువంటిదేమీ లేకుండా అక్కడ నిర్మాణాలు చేస్తుండటంపై ఆర్‌ఐ రెడ్డెప్ప మండిపడ్డారు. పీకేఎం ఉడా వైస్‌చైర్మన్ బాబర్ మాట్లాడుతూ వెంచర్లు వేసే వ్యాపారులు తప్పనిసరిగా లేఅవుట్ అ నుమతి తీసుకోవాలని, సూచిం చారు. లేకుంటే నిర్మాణాలను తొలగించడంతో పాటు, ప్లాట్లు వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు వెంచర్ బోర్డు కింద నోటీసు బోర్డు ఏర్పాటు చేయించా రు. ఈ నోటీసును అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా వుండగా అధికారులు అక్కడి నుంచి వచ్చేయగానే కొందరు వెళ్లి అధికారులు నోటీసు బ్యానర్‌ను చించిపడేశారు. దీన్ని బట్టి చూస్తే రియల్టర్లు ఎంత బరితెగించారో అని చిప్పిలి గ్రామస్థులు అనుకోవడం వినిపించింది.

రూ.3 కోట్ల విలువైన వంక పోరంబోకు ఆక్రమణ

మండలంలోని పొన్నేటిపాళెం గ్రామం వద్ద ఎర్రజేనుచెరువు మీదుగా తుమ్మలవంక ప్రవహిస్తూ బాహుదానదిలో కలుస్తోంది. ఈ వంక 60 అడుగుల వెడల్పుతో సర్వే నెంబర్ 43/2లో వెళుతోంది. ఈ వంకను పూడ్చివేసి ఆనవాళ్లు లేకుండా చేసేశారు. దీంతో 60 అడుగుల వెడల్పుతో 200 మీటర్ల పొడవునా వంక కనపడకుండా పోయింది. సుమారు 70 సెంట్లలో ఈ వంక పోరంబోకు భూమి బహిరంగ మార్కెట్‌లో ఎంత లేదన్నా రూ.3 కోట్లు ధర పలుకుతోంది. దీనిపై ఆర్‌ఐ రెడ్డెప్ప మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి వంక పోరంబోకు భూమి ఆక్రమించినట్లు తేలితే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



లేఅవుట్ వద్ద నోటీసు బ్యానర్ కడుతున్న పీకేఎం అధికారులు



రియల్టరు చించి పడేసిన్న నోటీసు బ్యానర్

ఎన్టీఆర్ భవన్‌లో కిశోర్‌కుమార్ రెడ్డి ప్రజా దర్బార్



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యద ర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మంగళ వారం ప్రజల వినతులు స్వీకరించా రు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ రకాల సమస్యలను ప్రస్తావి స్తూ వినతి పత్రాలను ఆయనకు అందజేశారు. మంగళవారం జరిగిన ఈ ప్రజా దర్బార్‌లో కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రామచంద్రాపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌తో కలిసి వినతిపత్రాలను స్వీకరించారు. సత్వర పరిష్కారం కోసం ఆయా విభాగాలకు పంపా రు. వినతిపత్రంతోపాటు సమస్యల పూర్వాపరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

కేంద్రమంత్రిని కలసిన శ్రీరామ్‌చినబాబు



కేంద్రమంత్రితో శ్రీరామ్‌చినబాబు, దొరస్వామినాయుడు

మదనపల్లె టౌన్, ఆగస్టు 27: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహా న్ నాయుడును మంగళవారం మంగళ గిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం లో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు యువత బలోపే తానికి చేస్తున్న చర్యలు, తదితర విషయాలపై చర్చించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామి నాయుడు వున్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల వివరాలు పక్కాగా ఉండాలి:జేసీ

కలికిరి, ఆగస్టు 27: ఫ్రీ హోల్డ్ భూముల క్షేత్ర స్థాయి పరిశీలన పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన పురోగతిపై స్వల్ప కాలిక సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక పరిశీలన అనంతరం రెండో విడతగా తిరిగి పరిశీలన జరుగుతుందని, కాబట్టి ఎలాంటి తప్పిదాలు లేకుండా పరిశీలనాంశాలను నమోదు చేయాలని చెప్పారు. వీఆర్వోల బదిలీలు పూర్తయిన అనంతరం లోతుగా సమీక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు మహేశ్వరీ బాయి, డిప్యూటీ తహసీల్దారు నవీన్, వీఆర్వోలు పాల్గొన్నారు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



తిరుచ్చిపై ఊరేగుతున్న పాండురంగ విఠలేశ్వరుడు

వాల్మీకిపురం, ఆగస్టు 27: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం రోహిణి నక్షత్రాన్ని పురష్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయ ప్రాంగణంలోని విఠలేశ్వర స్వామివారికి అభిషేకం, అర్చన, తోమాలసేవ నిర్వహించారు. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత పాండురంగ విఠలేశ్వరస్వామిని తిరుచ్చిపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, బాషికాచార్యులు, రాజుస్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో అక్రమాలను అరికట్టండి



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 27: ప్రైవేట్ ఆస్పత్రుల్లో అక్రమాలను అరికట్టాలని బహుజన యువసేన నాయకులు అధ్యక్షుడు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కొండయ్యను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ఆస్పత్రులు ప్రజలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అర్హులైన సిబ్బందిని సైతం నియమించుకోకుండా ప్రజల ప్రాణాలతో చె లగాటం ఆడుతున్నారని ఆరోపించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో దేవ శిరోమణి విచారణలో మదనపల్లె పట్టణంలో 50 ప్రైవేట్ ఆస్పత్రులు కనీస అనుమతులు లేకుండా నిర్వహిస్తునట్లు తేలిందన్నారు. ఏ ప్రలోభాలకు లోను కాకుండా ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శశికుమార్, సందీప్, బ్రహ్మ, తదితరులు పాల్గొన్నారు.

పశుగణనను జాగ్రత్తగా చేయండి

కురబలకోట, ఆగస్టు 27: పశుగణన బాధ్యతగా నిర్వహించాలని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్య నారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని అంగళ్లు పశు వైద్యశాలలో పశుగణనపై వైద్య సిబ్బందితో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. సిబ్బంది గ్రా మాల్లో పర్యటించి పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. గతంలో పశువుల బీమాను ఏడాది పాటు రాయితీపై కొనసాగిస్తుండగా తాజాగా మూడేళ్లకు గడువు పెంచినట్లు తెలిపారు. రైతులు రూ.398 చెల్లిస్తే రూ.30 వేల బీమాను పొందవచ్చున్నారు. దీంతో పాటు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీధర్‌రెడ్డి, వైద్యాధికారులు నవీన్, జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న తల్లారివాండ్లపల్లె గ్రామస్థులు

గుర్రంకొండ, ఆగస్టు 27: చిట్లాకుప్ప ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవాలని తల్లారివాండ్లపల్లె గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 617 లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను జరుపుకునేవారమని, ఈ భూమి ఆక్రమణకు గురి కావడంతో ప్రస్తుతం పశువుల పండుగ జరుపుకోవడం ఇబ్బందిగా ఉందన్నారు. కావున ప్రభుత్వ భూమిని సర్వే చేయించి ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రసాద్, రామచంద్రారెడ్డి, ఆనంద్‌రెడ్డి, శివరాం, సాయినాథ్, చిన్నరెడ్డి, అశోక్, బాబు, అమరనాథ్, వినోద్, నరసింహులు, దయాకర్ వినతిపత్రం అందజేశారు.

గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించాలి

పెద్దమండ్యం, ఆగస్టు 27: గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టి గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పెద్దమండ్యం మండలం అవికేనాయక్ తండా సర్పంచ్, రాజంపేట టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నటరాజ్ నాయక్ వినతి పత్రం అందజేశారు. మంగళవారం అమరావతి లోని పార్టీ కార్యాలయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు గిరిజనుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవికేనాయక్ తండా సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టు కాలువపై బ్రిడ్జి నిర్మించా లన్నారు. గిరిజనులు కొనేళ్లగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. కొత్త గిరిజన గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ తదితర నేతలు పాల్గొన్నారు.

మండల డీలర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

నిమ్మనపల్లి, ఆగస్టు 27: చౌక దుకాణాల డీలర్లు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ధనంజయులు సూచించారు. మంగళవారం మండలంలోని డీలర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడుగా గంగాధర ఉపాధ్యక్షుడుగా మల్లేశ్వర్ రావును డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి నెల కార్డుదారులకు క్రమం తప్పకుండా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తామని, డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రమణయ్య, రెడ్డెప్ప చలపతి, ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరుల పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేయడం లేదని ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 27: పట్టణంలోని 3, 4 నెంబర్ల చౌక దుకాణాల్లో రెండేళ్లుగా రేషన్ పంపిణీ కావడం లేదని రాధా, పులిమహాలక్ష్మి మంగళవారం తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా ఈ రేషన్ షాపుల ద్వారా రేషన్‌ను సరఫరా చేయాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడు రెడ్డిశంకర, టెట్రా ప్యాకెట్లతో పోలీసులు

నిమ్మనపల్లి, ఆగస్టు 27: కర్ణాటక మద్యాన్ని ఒకరిని అరెస్టు చేసి, 36 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వెంగంవారిపల్లి పంచాయతి గొల్లపల్లికి చెందిన రెడ్డిశంకర (27) కర్ణాటక నుంచి మద్యాన్ని తెచ్చి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలిచామ న్నారు.

కలికిరిలో అనుమానితుడి సంచారం



అనుమానితుడు

కలికిరి, ఆగస్టు 27: ఒక కేసులో అనుమానితుడుగా వున్న వ్యక్తి కలికిరిలో తలదాచుకు న్నట్లు సమాచారముందని పోలీసు ఇన్‌స్పెక్టర్ కె. రెడ్డి శేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడికి సం బంధించిన ఫొటోను కూడా వెల్లడించారు. నిందితుడు కలికిరిలోనే వున్నట్లు చెపుతూ, ఆచూకీ తెలిసిన వెంటనే 94407 96746 నంబరుకు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ములకలచెరువు, ఆగస్టు 27: ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు...వేపూరికోట పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన వరప్రసాద్ పెళ్ళి పత్రికలు పంచడానికి పక్క గ్రామమైన అడివిచెరువుకు వెళ్ళాడు. బంధువులకు పెళ్ళి పత్రికలు పంచిన తరువాత స్వగ్రామానికి వెళ్ళేందుకు బస్సు కోసం నిలబడి ఉండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పాము కాటుతో మహిళ పరిస్థితి విషమం

ములకలచెరువు, ఆగస్టు 27: పాము కాటేయడంతో ఓ మహిళ పరిస్థితి విషమంగా మారింది. కుటుంబీకుల కథనం మేరకు...ములకలచెరువు సమీపంలోని ఎర్రబల్లికి చెందిన రవిశేఖర్‌రెడ్డి భార్య లలితమ్మ మంగళవారం పొలంలో ఉన్న భర్తకు భోజనం తీసుకెళ్లింది. భర్తకు భోజనం వడ్డించి చెయ్యి వెనక్కి చాచడంతో చెత్తలో ఉన్న పాము ఆమెను కరిచింది. దీంతో ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇన్‌చార్జి సీఎస్ డీటీగా మహమ్మద్ సిరాజ్

నిమ్మనపల్లి, ఆగస్టు 27: మండలంలోని చౌకదుకాణాల నిర్వహణకు సీఎస్ డీటీగా మహ్మద్‌సిరాజ్‌కు తహసీల్దార్ ధనంజయులు బాధ్యతలను అప్పగించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ల్యాండ్ సర్వే డీటీగా పని చేస్తున్న సిరాజ్‌కు మదనపల్లి సీఎస్‌డీటీగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. చౌక దుకాణాలకు సరుకుల పంపిణీ, పర్యవేక్షణ వంటి బాధ్యతలు చేపట్టాలని తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

పెద్దమండ్యం, ఆగస్టు 27: ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఏపీవో మురళి ఆదేశించారు. పెద్దమండ్యం ఉపాధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు పెంచుకోవడానికి అనుమతులు పొందిన రైతులు మొక్కలు నాటుకుంటే సకాలంలో బిల్లులు మంజూరు అవుతాయన్నారు. పని దినాలున్న కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనుల వివరాలను ఆయా గ్రామాల్లోని కూలీలకు తెలియజేయాలన్నారు. ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి పనులు కూడా చేయాలన్నారు. మౌలిక సదుపాయ పనులను గుర్తించాలన్నారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మొగసాల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

గుర్రంకొండ, ఆగస్టు 27:మండలంలోని తరిగొండ బస్టాండులో నిర్మించిన మొగసాల గంగమ్మ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించి అమ్మవారు, బసవన్న విగ్రహాలు ప్రతిష్ఠించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్నికల్లో కష్టపడిన వారికి న్యాయం చేయండి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి తంబళ్లపల్లె నేతల వినతి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న తంబళ్లపల్లె టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 27: ఎన్నికల్లో కష్టపడి కార్యకర్తలకు న్యాయం చేయాలని, టీడీపీ ఇన్‌చార్జిగా దాసరిపల్లె జయచంద్రారెడ్డిని తప్పించి శంకర్‌కు బాధ్యతలు అప్పగించాలని, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు విన్నవిం చారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చినా, ఆయన చురుకుగా ప్రచారం చేయలేదని, దీంతో తామే శక్తివంచన లేకుండా ప్రచారం చేశామని, అయినా టీడీపీ అభ్యర్థి ఓడిపోయాడన్నారు. ఇం త జరిగినా జయచంద్రారెడ్డి తన తీరు మార్చుకో లేదని, పార్టీ కోసం కష్టించిన వారిని గుర్తించడం లేదన్నారు. ఐదేళ్లపాటు పార్టీ కోసం పెద్దిరెడ్డి కుటుంబంతో పోరాడిన తమపై పలు అక్రమ కేసులు బనాయించారన్నారు. మదనపల్లెలో నిర్వహించిన మినీ మహానాడు, పీలేరు లో నిర్వహించిన రా..కదలిరా.. కార్యక్రమాలకు వేల సంఖ్యలో కార్యకర్తలను సమీకరించి విజ యవంతం చేయడంలో భాగస్వాములయ్యామ న్నారు. నియోజకవర్గంలో నారాలోకేశ్ ఏడు రోజుల పాటు నిర్వహించిన యువగళం పాద యాత్ర విజయవంతం చేశామన్నారు. అయినా, నియోజకవర్గంలో తమకు గుర్తింపు లేకుండా చేస్తున్న జయచంద్రారెడ్డిని ఇన్‌చార్జిగా తప్పిం చి, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌ను ఇన్ చార్జిగా నియమించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జి. వెంకటరమణ, ఆనందరెడ్డి, నారాయణస్వామి రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని వేర్వేరుగా కలసి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



మొక్కలు నాటుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

బి.కొత్తకోట, ఆగస్టు 27: చిన్నతనం నుంచి క్రమశిక్షణను అలవరుచుకుంటే చక్కటి వ్యక్తిత్వం వస్తుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, మదర్ థెరిసా జన్మదినం సందర్భంగా బి.కొత్తకోట పట్టణంలోని విద్యార్థి స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషిచేసి ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నించాలని హితబోధ చేశారు. తల్లితండ్రులు సైతం పిల్లలు ఆన్‌లైన్ గేమ్‌లు, మొబైల్స్‌కు బానిసలు కాకుండా శ్రద్ధ చూపడంతోపాటు, చదువుపై ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. మెడికల్ ఆఫీసర్ హసీనా పర్వీన్, సీఐ రాజారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, పాఠశాల కరెస్పాండెంట్ రమణ, యండీ మస్తాన్, డి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బ్యాంకు లింకేజ్ రుణాలు : ఏపీవో



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దమండ్యం, ఆగస్టు 27: మహిళా సంఘాలోని అర్హులైన సభ్యులకు బ్యాంకు లింకేజ్ రుణాల టార్గెట్ పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మధుశేఖర్‌బాబు ఆదేశించారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం విరివిగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. పాడి పరిశ్రమ, చిన్న వ్యాపారులు, చేతి వృత్తులవారు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకొని కుటుంబాలు బాగు చేసుకోవాలన్నారు. సీసీ, సంఘమిత్రలు, వీవో లీడర్లు సమష్టి అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజ్, ముద్ర రుణాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సీసీలు సూరి, శంకరమ్మ, శ్రీనివాసులు, రమణ, రెడ్డమ్మ, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కేఎన్. బాలాజీ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 27 : మండలంలోని బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను మంగళవారం ఎంపీడీ వో కేఎన్ బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, హాజరైన విద్యార్థు ల వివరాలను ప్రధానోపాధ్యా యులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో క్రమశిక్షణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాల సంజీవయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోమటివాని చెరువుపై రోడ్డును వన్‌వేగా మార్చాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 27: పట్టణ నడిబొడ్డులోని కోమటివానిచెరువు కట్టపై ఉన్న రోడ్డును వన్‌వే చేయాలని పట్టణ అపెక్స్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు డిమాండ్ చేశారు. చెరువుకు ఇరువైపులా భద్రతా వలయం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం చెరువు కట్టపై టూవే ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 27:ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌ఆర్‌ఎస్ సంస్థ ప్రాజెక్టు మేనేజరు పురుషోత్తం అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి పట్టణంలో మున్సిపల్ సిబ్బందికి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ సుఖవ్యాధులు, టీబీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నివారణకు చర్యలు వివరించారు. జనార్దన్, రామాంజులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30న ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీ డిప్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 27: ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 30 లక్కీడిప్ నిర్వహిస్తున్న ట్లు వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె- తంబళ్లపల్లె మార్గంలో ప్రయాణం చేసిన ప్రయాణికులు టికెట్ల వెనుక వైపున వారిపేరు, ఊరుపేరు. మొబైల్ నెంబర్ రాసి బస్సులోని గిఫ్ట్‌బాక్స్‌లో వేయాలని కోరారు. బస్టాండ్‌లో డ్రా తీసి ముగ్గురికి బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఏపీయూఎస్ఎంఏ కార్యవర్గం ఎన్నిక

గుర్రంకొండ, ఆగస్టు 27: నియోజకవర్గ ఏపీయూఎస్ఎంఏ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కలికిరిలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా శివకుమార్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడుగా ఆదినారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ, సెక్రటరీగా సురేంద్రబాబు, ట్రెజరర్‌గా నాగరాజు, సభ్యులుగా రఘునాథ్‌రెడ్డి, భార్గవి, సదానందరెడ్డి, మాధవి, రమణ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తాలూకా సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు జయరామ్ యాదవ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు27: మదనపల్లె తాలూకా సీఐగా వచ్చిన కళా వెంకటరమణను మదనపల్లె మండలం కొండామరిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు జయరాం యా దవ్ తన కుమారుడు రూరల్ యువ అధ్యక్షుడు రమణతో కలిసి మంగళ వారం సన్మానించారు. సీఐకి శాలువా కప్పి మిఠాయిలు అందజేసి శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలుకా పరిధిలో శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది : చమర్తి

రాజంపేట, ఆగస్టు 27: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేవారని, ఆ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించేలా చేస్తామన్నారు. ఈ శిక్షణ తరగతుల వల్ల రాష్ట్రంలో ప్రమాదాలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, జిల్లా కార్యదర్శి శేఖర్, డిపో కార్యదర్శి మౌలా, అధ్యక్షుడు సుబ్బయ్య, ఉద్యోగులు రమణ, చంద్ర, బాషా, బాలాజీ, పుల్లయ్య, మోహన్, మురళీ, కృష్ణయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో సాంకేతిక జోడింపు అవసరం

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 27: ఉద్యాన సాగులో సాంకేతిక జోడింపు అవసరమని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.గోపాల్ తేన్నారు. మంగళవారం మండలంలోని ఉద్యానవర్సిటీలో సాంకేతిక అంశాల ద్వారా సుస్థిర ఉద్యాన సాగు అనే అంశంపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా మిశ్రమ అభ్యాసన ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరగతులను నిర్వహించారు. వర్సిటీ పీజీ డీన్ ఎస్.సూర్యకుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్, కూరగాయల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, డాక్టర్ సూదీప్ మార్య, ఐసీఏఆర్-ఐఏఎస్ఆర్ఐ, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, అధ్యాపకులు ప్రదీప్‌కుమార్, క్రాంతిరేఖ, శశికళ ప్రసంగించారు.